క్లుప్తంగా

రేపు వారసంత నిర్వహణకు వేలం

టేకుమట్ల: మండల కేంద్రంలో ప్రతీ బుధవారం నిర్వహించే వారసంత(లైబజార్), పశువుల సంత నిర్వహణకు రేపు(గురువారం) గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి శైలజ, పంచాయతీ కార్యదర్శి సాంబశివుడు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు ఉదయం 10గంటలకు ఇంటి ధ్రువీకరణ పత్రంతో పాటు, రూ.10వేల ధరావత్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

ఎన్నిక



చిట్యాల: కళాకారుల ఐక్య వేదిక మండల అధ్యక్షుడిగా మండలంలోని చింతకుంట రామయ్యపల్లి గ్రామానికి చెందిన గూడెపు రజినీకాంత్‌ను మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నుకున్నట్లు జిల్లా సాంస్కృతిక కార్యదర్శి జన్ను యుగేందర్ అన్నారు. ఈ సందర్భంగా యుగేందర్ మాట్లాడుతూ.. రజినీకాంత్ కళారంగంలో ఎన్నో సేవలను అందించడంతో పాటు, సామాజిక అంశాలపై, సమస్యలపై పోరాటం చేశారని అన్నారు. ఆయన సేవలను గుర్తించి మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక గేయ రచయితలు దాసారపు నరేష్, మ్యాదరి సునీల్, బానోతు రాజునాయక్, పుల్ల ప్రతాప్, జెట్టి శంకర్, బండి శ్రీనివాస్, దూడపాక దివాకర్, శ్రీనివాస్, సాగర్, సంపత్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: జంగేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని రైతుల నుంచి క్రాపు లోన్లకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత రైతులు ఆధార్‌కార్డు, పాస్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ప్రస్తుత పహాణి, 1బీ, ఈసీ, డీసీఏబీ బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్‌లతో పాటు 4పాస్‌పోర్టు సైజు ఫొటోలు కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

బాధ్యతల స్వీకరణ

గోవిందరావుపేట: మండల పరిధిలోని పస్రా పోలీస్ స్టేషన్‌కి నూతన ఎస్సైగా అచ్చ కమలాకర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. డీసీఆర్‌బీ ములుగు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

పోలీసుల తనిఖీ



వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్ వద్ద మంగళవారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలను నిర్వహించారు. ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సివిల్, టీఎస్‌ఎస్‌పీ ఫోర్స్‌తో కలిసి 163 నంబర్ జాతీయ రహదారి, వాజేడు, భద్రాచలం రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేశారు. ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు వాహనంలోని బ్యాగులను సోదాలు చేశారు.

ట్రై సైకిల్ అందజేత



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఎస్సీ మల్లిగూడెం గ్రామానికి చెందిన కోయిల అఖిల్ అనే దివ్యాంగునికి మంగళవారం ట్రై సైకిల్‌ను చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ పాయం రమణ చేతుల మీదుగా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ శిరీష , చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు రమాదేవి, పుష్పలత తదితరులు ఉన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్య పరీక్షలు



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో మహిళలకు వైద్య పరీక్షలను ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 72 మంది మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. 18 మంది వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించారు. సేకరించిన రక్త నమూనాలను పరీక్షలకు ములుగు ఏరియా వైద్యశాలకు పంపించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మల్హర్: తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న రాధిక



కాటారం: అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ రాధిక

కాటారం: బాలింతలు, గర్భిణులు, చిన్నారులు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని దీంతో సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ రాధిక అన్నారు. మండలంలోని రేగులగూడెం , మేడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషన్ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. పోషకాహారలోపంను నిర్మూలించడమే పోషణాభియాన్ లక్ష్యం అన్నారు. చిరుధాన్యాలతో కూడిన పదార్థాలు, అందుబాటులో ఉండే ఆకుకూరలు తినడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఎనిమియా లాంటి వ్యాధులు సక్రమించవని సూచించారు. పుట్టిన బిడ్డకు ఖచ్చితంగా ముర్రుపాలు పట్టించాలని పేర్కొన్నారు. 3 నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రీస్కూల్‌కు పంపించాలన్నారు. ప్రీస్కూల్ ప్రాముఖ్యత గూర్చి వివరించి చిన్నారులకు అన్న ప్రాసన చేయించారు. ఈ కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అరుణ, వీణ, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్లు కమలాదేవి, అన్నపూర్ణ, ప్రమీల, దివ్య, రోజ, శ్యామల, మదర్స్ కమిటీ చైర్మన్ శ్రీదేవి, ఉపాధ్యాయులు శ్రీకళ, స్రవంతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో ఆరోగ్యం

మల్హర్: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సీడీపీ రాధిక అన్నారు. మండలంలోని కొయ్యూరు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషన్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ.. 3 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాల చిన్నారులను అంగన్‌వాడీ ప్రీ స్కూల్లో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలోకి పంపించిన పిల్లలకి ప్రీ స్కూల్ బుక్స్, పిల్లల ప్రొఫైల్ అభివృద్ధి చార్టు, పర్యవేక్షణ కార్డు ఉచితంగా సరఫరా చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఆరు నెలల పాటు చిన్నారులకు తల్లి పాలే తాగించాలని, ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు కేంద్రంలో ఇచ్చే బాలామృతం, కోడిగుడ్లు తినిపించాలని వివరించా రు. అనంతరం ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ సరస్వతి, పంచాయతీ కార్యదర్శి ప్ర సాద్, టీచర్లు రజిత, మాలి తదితరులు పాల్గొన్నారు.

మెళకువలు పాటిస్తే అధిక దిగుబడి



వీడియో కాన్ఫరెన్స్ వీక్షిస్తున్న డీఏఓ, రైతులు

కాటారం: రైతులు పంట సాగులో మెళకువలు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని శాస్త్రవేత్తలు డాక్టర్ సుచిత్ర, డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో శాస్త్రవేత్తలు రైతులకు పంట సాగుపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. మామిడిలో పిందె రాలడం, రైతులు చేపట్టాల్సిన నివారణ చర్యలు, అధిక ఉష్ణోగ్రతల కారణంగా వివిధ పంటల్లో జరిగే నష్టాలు, వాటి నివారణ, సేంద్రియ వ్యవసాయ సాగు పద్ధతులపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయభాస్కర్ పరిశీలించారు. రైతులు రైతునేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి గిరి రామకృష్ణ, ఏఈఓలు రాజన్న, దివ్యజ్యోతి, రైతులు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



సీఐని సన్మానిస్తున్న నాయకులు

చిట్యాల: చిట్యాల సర్కిల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన మల్లేష్‌యాదవ్‌ను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మొకిరాల మధువంశీకృష్ణ, జిల్లా కార్యదర్శి చిలుకల రాయకొమురు, ఎంపీటీసీ దబ్బెట అనిల్, మండల నాయకులు చింతనిప్పుల మధు, సర్వ శరత్‌కుమార్, పింగిళి సతీష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

చిట్యాల: ఇటీవల చిట్యాలకు నూతనంగా వచ్చిన సీఐ మల్లేష్ యాదవ్, ఎస్సై గంధమనేని శ్రావణ్ కుమార్‌లను ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు నేరేళ్ల ఓదేలు ఆధ్వర్యంలో మంగళవారం మర్యాద పూర్వకగా కలిసి శాలువాలతో సన్మానించారు. ఆయన వెంట మండల నాయకులు పర్లపెల్లి కుమార్, జేరిపోతుల ఓదేలు, కలికోట రాజపోచయ్య, నేరేళ్ళ రవి, జిల్లెల పోచయ్య ఓదేలు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలను మెడికోలుగా గుర్తించాలి



మాట్లాడుతున్న కత్తి సంపత్‌గౌడ్

టేకుమట్ల: గ్రామాల్లో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలను రాష్ట్ర ప్రభుత్వం మెడికోలుగా గుర్తించి సర్టిఫికెట్లు అందించాలని ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కత్తి సంపత్‌గౌడ్ కోరారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే పార్టీ కార్యాలయంలో ఆర్‌ఎంపీ, పీఎంపీల జిల్లాస్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ అందించి మెడికోలుగా గుర్తిస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సైతం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని అన్నారు. ఆర్‌ఎంపీ, పీఎంపీలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిరంతరం ప్రాథమిక వైద్యాన్ని అందిస్తూ, ప్రభుత్వ ఆస్పత్రులకు చేర్పుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇచ్చిన మాట ప్రకారం ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ అందించి మెడికోలుగా గుర్తించాలన్నారు. అలాగే ఏప్రిల్ మొదటి వారంలో జిల్లా కేంద్రంలో ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ సభను నిర్వహిస్తామని, సభకు భారీ సంఖ్యలో ఆర్‌ఎంపీ, పీఎంపీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల ఆర్‌ఎంపీ, పీఎంపీలు పాల్గొన్నారు.

ఎస్సైకి..



ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

మహాముత్తారం: నూతనంగా ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన మహేందర్‌కుమార్‌ను పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ములుగుపల్లి మాజీ సర్పంచ్ దూలం మల్లయ్యగౌడ్ శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాపు, కొర్లల సమ్మయ్య తదితరులు ఉన్నారు.

‘ఉపాధి’ పనుల బహిష్కరణ



పనులను బహిష్కరించిన కూలీలు

రేగొండ: మండలంలోని రూపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉపాధిహామీ కూలీలు మంగళవారం పనులను బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిర్ణీత సమయంలో కూలి అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. మండుటెండలను సైతం లెక్క చేయకుండా పనులు చేస్తున్న సమయానికి డబ్బులు అందడంలేదని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది చేసిన పనుల డబ్బులు ఇప్పటికీ రాకపోవడంతో పనులు బహిష్కరించినట్లు తెలిపారు.

కొడవటంచ హుండీ ఆదాయం రూ.11.58లక్షలు



కానుకలు లెక్కిస్తున్న భక్తులు

రేగొండ: మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం హుండీ ఆదాయం రూ.11లక్షల 58వేలు వచ్చినట్లు ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం పర్యవేక్షణ అధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయంలో హుండీలను లెక్కించారు. నోట్లు రూ.10,99,235, నాణెములు రూ.58,776 వచ్చాయి. 2024 జాతర బహిరంగ వేలంలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి వేలం రూ.4,24,000, పూలదండలు, విడిపూలు అమ్ముకునేందుకు రూ.11వేలు హెచ్చుపాటగా దుకాణ యాజమానులు దక్కించుకున్నారని ఈఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, అర్చకులు బుచ్చమాచార్యులు, శ్రీనివాసచార్యులు కమిటీ సభ్యులు శ్రీధర్, ఓంకార్, కోటేశ్వర్‌రావు, జోగేందర్, సుదర్శన్, తిరుపతి, లక్ష్మీ, సంజీవరెడ్డి, తిరుపతి, కళావతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్



మాక్‌పోలింగ్‌లో విద్యార్థులు

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. స్కూల్ లీడర్ ఎన్నికల్లో బండారి వినయ్ ఎన్నికయ్యాడు. తరగతి లీడర్లుగా ఆరవ తరగతికి బండారి అన్వేష్, ఏడవ తరగతికి సంజయ్, 8వ తరగతికి ఐశ్వర్య, 9వ తరగతికి నక్షత్ర ఎన్నికయ్యారు. ఎన్నికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు విజయపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సురేందర్, కల్యాణి, అనిల్‌కుమార్, రాజు, కుమారస్వామి, ప్రవీన్, లలిత, విజత, శ్రీకళ, స్పందన, చందర్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

మహాముత్తారం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చెక్కులు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లోని 61మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుభద్ర, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీటీసీ లక్కిరెడ్డి నర్సింహారెడ్డి, లింగమల్ల దుర్గయ్య లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న పూనెం సాయి

వెంకటాపురం(కె): ఆదివాసీల సాగులో ఉన్న పోడుభూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొమురంభీమ్ నగర్‌లో గోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలు పోరాడి సాధించుకున్న అటవీ హక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు అధికారులు కుట్రలు చేస్తున్నారని అన్నారు. బెస్తగూడెం కొమురం భీమ్ కాలనీవాసుల పోడు భూములను లాక్కునేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనేతరులు కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనితి వెంకటకృష్ణ, పూనెం ప్రతాప్ ఉన్నారు.

ఇంటి భోజనమే దిక్కు!

- 15 రోజులుగా నిలిచిన మధ్యాహ్న భోజనం
- పట్టించుకోని అధికారులు



ఇంటి భోజనం చేస్తున్న విద్యార్థులు

రేగొండ: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మధ్యాహ్న భోజన పథకం క్షేత్రస్థాయిలో అబాసు పాలవుతోంది. వంట కార్మికుల మధ్య తలెత్తిన గొడవ విద్యార్థుల పాలిట శాపంగా మారింది. వివరాల్లోకి వెళ్లితే... రేగొండ మండలంలోని లింగాల మండల పరిషత్ ప్రాథమికొన్నత పాఠశాలలో మొత్తం 67 మంది విద్యార్థులు ఉన్నారు. ఆ విద్యార్థులకు 15 రోజులుగా మధ్యాహ్న భోజనం నిలిచిపోయింది. పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారు చేసే కుక్, హెల్పర్ మధ్య తలెత్తిన గొడవల కారణంగా వంటలు చేయడం బంద్ చేశారు. దీంతో విద్యార్థులకు ఇంటి భోజనమే దిక్కుగా మారింది. 15 రోజులుగా విద్యార్థులు ఇంటి భోజనంతో సరిపెట్టుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణను వివరణ కోరగా వంట కార్మికుల మధ్య తలెత్తిన గొడవ కారణంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నిలిచిపోయిన మాట వాస్తవమేనని, నేటి (బుధవారం) నుంచి మధ్యాహ్న భోజనం విద్యార్థులకు యథావిధిగా అందజేస్తామన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



పరీక్ష ప్యాడ్లను ఇస్తున్న క్లబ్ సభ్యులు

మల్హర్: మండలంలోని తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలోని 10 తరగతి విద్యార్థులకు పెద్దపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తాడిచర్ల ప్రశాంతి ఫిలింగ్ స్టేషన్ యాజమాని వేల్పుల రమేష్ సహకారంతో రూ.12వేల విలువ గల పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, స్కేళ్లను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు లయన్ సాధుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. చదువుకున్న పాఠశాలకి, విద్యాబుద్ధులు నేర్పిన గురువు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రావు సమక్షంలో పంపిణీ చేయడం సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో దాత లయన్ వేల్పుల రమేష్, ఉపాధ్యక్షుడు లయన్ మీసాల సత్యనారాయణ, లయన్ మల్క రాంకిషన్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన ముసాపురి రమేష్ ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందాడు. అతడి జ్ఞాపకార్థం మండల కేంద్రంలోని కాకతీయ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు ఆయన సతీమని రమాదేవి మంగళవారం ప్యాడ్లను పంపిణీ చేశారు. పాఠశాల కరస్పాండెంట్ ఎండీ రాజ్‌మహ్మద్, ఉపాధ్యాయులు రమేష్, భాస్కర్, శివరాజ్, మధుకర్, పరమేశ్వరీ, తేజస్వీని, రేణుక, విద్యార్థులు పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన కూనాడి వెంకటనారాయణరెడ్డి జ్ఞాపకార్థం అతడి కుమారుడు ప్రభాకర్‌రెడ్డి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, జామెట్రి బ్యాక్స్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బార్ కౌన్సిలర్ మెంబర్ దుస్సా జనార్దన్, దొడ్ల భాస్కర్, గట్ల విజయపాల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు జంపయ్య, సమ్మయ్య, రహీంపాషా, సుధాకర్, శ్రీదేవి, స్వరూపరాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



మాట్లాడుతున్న సీఐ రాజేశ్వర్‌రావు

పలిమెల: కొత్త వ్యక్తులు, అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దని సీఐ రాజేశ్వర్‌రావు గ్రామస్తులకు సూచించారు. కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం మండలంలోని ముకునూర్ గుత్తికోయగూడెంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతీ ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. మావోయిస్టులకు ఆశ్రయం కల్పించడం చట్టరీత్యా నేరమని, ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలోకి కొత్త వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. త్వరలో లోక్ సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ఎన్నికలు సాఫీగా నిర్వహించేలా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పలిమెల ఎస్సై తమాషారెడ్డికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తమాషారెడ్డి, సివిల్, టీఎస్‌ఎస్‌పీ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

జాతర చైర్మన్‌గా రఘోత్తంరెడ్డి



టేకుమట్ల: మండలంలోని రాఘవాపూర్ శివారులో ప్రతీ సంవత్సరం నిర్వహించే శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల జాతర కమిటీ చైర్మన్‌గా బండ రఘోత్తంరెడ్డిని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ వివరాలను వెల్లడించారు. ప్రధాన కార్యదర్శిగా మొగిళి రమేష్, వైస్ చైర్మన్‌గా అంబాల కిరణ్‌కుమార్, కోశాధికారిగా పర్లపెల్లి సాంబయ్యతో పాటు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం చైర్మన్ బండ రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడంతో పాటు, ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులను తీసుకొచ్చి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నందికొండ మహిపాల్‌రెడ్డి, మాదం కొముదయ్య, పైడిపెల్లి లచ్చయ్య, గోపికారి మల్లయ్య, పైడిపెల్లి సతీష్, భాషవేని రమేష్, జొన్నల రవీందర్, అంబాల మూగయ్య, ర్యాకల సమ్మయ్య, సత్తయ్య, జనార్ధన్‌రెడ్డి, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు ప్రశాంతంగా రాయాలి



విద్యార్థులతో జెడ్పీటీసీ పాయం రమణ

వెంకటాపురం(కె): పదో తరగతి విద్యార్థులు ప్రశాంతగా ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయాలని జెడ్పీటీసీ పాయం రమణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను అందజేశారు.